ప్రజాశక్తి
శుక్రవారం 11 జూలై 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



మతసామరస్యానికి ప్రతీక బారాషాహీద్ దర్గా : ఆవాజ్

ప్రజాశక్తి-నెల్లూరు

మతసామరస్యానికి ప్రతీక అయినటువంటి బారాషాహీద్ దర్గాలో గురువారం ఆవాజ్ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రఫీద్ మాట్లాడుతూ దేశంలోనే మతసామరస్యానికి నిదర్శనం నెల్లూరు జిల్లా అని జిల్లా లో హిందువులు, ముస్లిములు అనే తేడా లేకుండా పేర్లు పెట్టుకోవడం, దర్గాలను సందర్శించడం జరుగుతుందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం. వి. రమణ, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ నజీర్, షేక్ మస్తాన్, షేక్ మునీర్, నగర సభ్యులు వయాజ్, అమాన్, యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కరేడు భూ పోరాటంపై విభజన రాజకీయం

టిడిపి కార్యకర్తలతో ఎంఎల్ఏ 'ఇంటూరి' సమావేశం- ఉద్యమం నుంచి తప్పుకోవాలని బుజ్జగింపులు

ప్రజాశక్తి-కందుకూరు

భూసేకరణకు వ్యతిరేకంగా కరేడు రైతులు సాగిస్తున్న ఉద్యమంలో విభజన రాజకీయానికి అధికార పార్టీ తెరలేపింది. టిడిపి కార్యకర్తలను ఉద్యమ బాట నుంచి పక్కకు లాగడానికి అధికార పార్టీ నాయకులు అన్ని విధాల ప్రయత్నాలు ప్రారంభించారు. ఉలవపాడు మండలంలోని కరేడులో దాదాపు 8,400 ఎకరాల వ్యవసాయ భూమిని ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు దారా దత్తం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ భూమిలో 4555 ఎకరాల సేకరణకు రెవెన్యూ శాఖ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు పంటలు పండే భూములను సోలార్ పరిశ్రమకు అప్పగించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను రైతులు పెద్ద ఎత్తున అడ్డుకుంటూ ఉద్యమిస్తున్నారు. రైతు ఉద్యమం ఇలాగే కొనసాగి తీవ్రతరమైతే భూసేకరణ సాధ్యం కాదని భావించిన అధికార పార్టీ నాయకులు తమ వ్యూహాలకు పదును పెట్టారు. ఇందులో భాగంగానే కందుకూరు శాసనసభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం మధ్యాహ్నం కరేడుకు చెందిన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతుల సమావేశం పేరు పెట్టినప్పటికీ నిజానికి టిడిపి కార్యకర్తలను మాత్రమే ఆహ్వానించారు. అయితే కేవలం ముగ్గురు నాయకులు తప్ప టిడిపి కార్యకర్తలు ఎవరు ఈ సమావేశంలో భూసేకరణకు అంగీకరించలేదు. సోలార్ పరిశ్రమకు భూములు ఇవ్వడానికి తాము సిద్ధమేనని చెప్పిన ముగ్గురు నాయకులలోను ఇద్దరికి అనేక ఏళ్లుగా వ్యవసాయంతో ప్రత్యక్ష సంబంధం లేదు. వ్యాపారులుగా తమ పొలాలను కౌలుకు ఇస్తూ కాలక్షేపం చేస్తున్నారు. పైగా వాళ్లిద్దరూ జనబలం కలిగిన నేతలు కాదు. కేవలం స్వయం ప్రకటిత నాయకులే ఈ సమావేశంలో పాల్గొన్న మిగిలిన కార్యకర్తలందరూ భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకించడంతో శాసనసభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు అక్కడే కొందరు క్రియాశీల కార్యకర్తలను ప్రత్యక్షంగా తన గదిలోకి పిలిపించుకొని మాట్లాడారు. అయినా కార్యకర్తలు మెత్తబడలేదు. సోలార్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలను ఇప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని శాసనసభ్యుడు భరోసా ఇచ్చినప్పటికీ కార్యకర్తలు ఊకొట్టలేదు. భూములకు మరింత పరిహారం ఇప్పించేందుకు తాను కృషి చేస్తానని కూడా శాసనసభ్యులు హామీ ఇచ్చారు. విశేషమేమిటంటే సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు భూసేకరణ ను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఓ నాయకుడు మాత్రం కరేడులోని 75 శాతం మంది ప్రజలు భూసేకరణకు అనుకూలంగా ఉన్నారని అక్కడ చెప్పారు. భూసేకరణ వ్యతిరేక ఉద్యమంలో చీలికలు పెట్టేందుకు అధికార పార్టీ నేతలు చేస్తున్న పనిలో ఇది తొలి అడుగు గేనని ముందు ముందు మరిన్ని ఎత్తులు జిత్తులు చూడాల్సి వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు

వైసిపి వైఖరిపై అనుమానాలు

కరేడు భూసేకరణ వ్యతిరేక ఉద్యమాన్ని నిరుగార్చడానికి అధికార పార్టీ నేతలు ఓవైపు ప్రయత్నిస్తుండగా మరోవైపు ప్రతిపక్ష వైసిపి నాయకులు రైతు ఉద్యమం పట్ల అంటీ అంటనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన శాసనమండలి సభ్యుడు తూమాటి మాధవరావు ఓ మారు కరేడు గ్రామ సభకు వెళ్లి వచ్చారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున కరేడువైపు తొంగి చూడలేదు. కేవలం భూసేకరణకు వ్యతిరేకంగా పత్రికా ప్రకటన ఇచ్చారు. అయితే కందుకూరు శాసనసభ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్ ఇంతవరకు కరేడువైపు తొంగి చూడలేదు. కేవలం కందుకూరులో కొన్ని రైతులకు మద్దతుగా పత్రిక ప్రకటనలు ఇచ్చారు. ఆయన కూడా బుధవారం కందుకూరులో తమ పార్టీకి చెందిన కరేడు కార్యకర్తలతో భూసేకరణ సమస్యపై మాట్లాడారు. అంతకు మించి ముందు అడుగు వేయలేదు. దీంతో కరేడు తోపాటు కందుకూరు నియోజకవర్గంలోని వైసిపి కార్యకర్తల్లో ఇండో సోలార్ పరిశ్రమ పట్ల తమ పార్టీ వైఖరి పై అనుమానాలు చెలరేగుతున్నాయి.

యూరియాను అందుబాటులో ఉంచాలి

బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలను అడ్డుకోవాలి - ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, మూడు లక్షల ఎకరాల్లో రైతులు పంట సాగుబడి చేస్తుంటే అందుకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేయలేకపోతుందని, తక్షణమే యూరియా బ్లాక్‌మార్కెట్ విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లాకార్యదర్శి మూలి వెంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్, సీనియర్ నాయకులు మూలం రమేష్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలోవారు మాట్లాడారు. జిల్లా రైతాంగం సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో 8.5 లక్షల ఎకరాలకు పైగా వరి పంట సాగుబడి చేస్తారన్నారు. ఈ ఏడాది ఎడగారులో ఇప్పటికే 2 లక్షల 75 వేల ఎకరాలలో వరినాట్లు వేశారన్నారు. మరి కాస్త ఎక్కువ అయ్యే అవకాశాలు లేకపోలేదన్నారు. జిల్లా ఐఎబి సమావేశంలో 3.5 లక్షల ఎకరాల భూములల్లో వరి పంట సాగుబడికి సోమశిల జలాలు అందజేస్తామని అధికారులు ప్రకటించారన్నారు. మెట్ట ప్రాంతాలల్లో బోర్ల కింద మరికొంత విస్తీర్ణంలో రైతులు వరి పంట సాగుబడి చేస్తున్నారన్నారు. ఈ గణాంకాలన్నీ పరిశీలిస్తే 3.5 లక్షల ఎకరాల భూములలో పండిస్తున్న పంటకు అవసరమైన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు ప్రభుత్వం సిద్ధం చేయాల్సి ఉందన్నారు. గ్రామ స్థాయి రైతాంగం మాత్రం ఎరువుల కోసం బారులు తీరడం రోజు రోజుకు అధికమౌతుందన్నారు. మండల వ్యవసాయ అధికారులను రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు సంప్రదించగా తగినంత మేరకు యూరియా అందడం లేదని, ఏ రోజుకు ఆ రోజు జిల్లా అధికారులను సంప్రదిస్తున్నామంటు అధికారులు చెబుతున్నారన్నారు. ఒక ఎకరాకు 115 కిలోల యూరియా ఉపయోగించాలని అధికారులు చెబుతున్నారని, వాతావరణంలో కలుగుతున్న మార్పుల వల్ల రైతులు మాత్రం ఎకరాకు 200 కిలోలు వాడాల్సి వస్తుందన్నారు. ఈ అంశంపై రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాలల్లో రైతు సేవా కేంద్రాలు మాత్రం నామమాత్రంగా కూడా రైతులకు సేవలందించడం లేదన్నారు. యూరియా కొనుగోలు చేయాలంటే సబ్సిడీ కింద రూ.269లకు అందించినా అధనంగా రూ. 70లు చెల్లిస్తున్నారన్నారు. రైతులకు ఈ అధనపు ఖర్చు లేకుండా చేయాలంటే ప్రభుత్వం యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించాలన్నారు. ఆ విధంగా చేసినప్పుడు మాత్రమే రైతు సేవా కేంద్రం ఏర్పాటు చేసిన దానికి ఫలితం కనిపిస్తుందన్నారు. రైతు సొసైటీలల్లో తగినంత యూరియా లేక పోవడంతో వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారులు రైతులకు యూరియాను అందించడంలో శాస్త్రీయ పద్దతలను పాటించడం లేదని, మండల స్థాయి వ్యవసాయ అధికారులు ఎంత మేరకు వరి నాట్లు పోసారనే గణాంకాలు సేకరించి అందుకు అనుగుణంగా యూరియాను అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికై ప్రభుత్వం దృష్టికి జిల్లాలో యూరియా కొరత విషయాన్ని జిల్లా అధికారులు తీసుకెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఎంఎల్ఏ 'ఇంటూరి' ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కందుకూరు : గురు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కోవూరు రోడ్డులో గల శ్రీ సాయిబాబా గుడిలో జరిగిన ప్రత్యేక పూజలలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని పూజలు నిర్వహించారు అనంతరం ఎమ్మెల్యేఆలయ కమిటీ సభ్యులతో శ్రీ సాయిబాబా గుడి అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పి-4 కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో పి-4 కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక దష్టి సారించినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి పి-4 కార్యక్రమం అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్లోని శంకరన్ హాలు నుంచి కలెక్టర్ ఆనంద్, అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు జిల్లాలో బంగారు కుటుంబాలు, మార్గదర్శిలను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే జిల్లాలోని పలు కంపెనీల పారిశ్రామికవేత్తలతో ఒక సమావేశం నిర్వహించామని, అందరిని సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా కషి చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ వై ఓబులేసు నందన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, డిఆర్డిఏ పిడి నాగరాజకుమారి, సిపిఒ నరసింహారావు ఉన్నారు.

స్మార్ట్ మీటర్స్‌ను వ్యతిరేకిస్తూ
సిపిఎం ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వం గహాలకు స్మార్ట్ మీటర్స్ బిగించడానికి నిరసిస్తూ 32 వ డివిజన్ నందు సిపిఎం పార్టీ స్థానిక శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తూ స్టిక్కర్స్ అంటించారు. సిఐటియు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ గహ అవసరాలకు కరెంటు స్మార్ట్ మీటర్స్ బిగించడం వలన, కరెంటు చార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే ట్రూ అప్, సర్ ఛార్జీల పేరుతో ప్రజలపై అధిక భారాలు మోపుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజలు కూడా అర్థం చేసుకొని మన ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించకుండా వ్యతిరేకించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 32 డివిజన్ శాఖ కార్యదర్శి ఖలీల్ . వై రంగయ్య. ఎస్.కె షాన్వాజ్. ఎస్ కే జిలాని. ఎస్కే ఎగ్బాల్. ఎస్కే అన్వర్. వి సత్యం. ఎస్.కె నౌ షాద్. పి మస్తాన్. ఎస్కే గౌస్. ఎస్కే జిలాని. ఎస్.కె సందాని పాల్గొన్నారు

నామమాత్రంగా సదస్సు

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరులోని వెలుగు కార్యాలయంలో రైతు మిత్ర రైతు ఉత్పత్తిదారుల సదస్సు గురువారం మొక్కుబడిగా జరిగింది. మండలంలో మొత్తం 2. 23 రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లు ఉండగా కేవలం 20 రైతు గ్రూపులకు సంబంధించిన లీడర్లను పిలిపించుకొని ఏకపక్షంగా నూతన కమిటీ ఎంపిక చేసుకున్నా రని గుడ్లూరు కు చెందిన పలువురు రైతులు తెలిపారు నూతన కమిటీకి అవసరమైన సభ్యులు లేకపోయినా మండల రైతు ఉత్తదారుల సంఘం నాయకుల్ని ఎన్నుకోవడంపై పలువురు రైతులు నుంచి విమర్శలు వస్తున్నాయి మండలంలో ఉన్న అన్ని రైతు మిత్ర సంఘాల లీడర్లకి సమాచారం పంపి నూతన కమిటీ ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు.

జ్యోతి ప్రజల్వనతో ఉత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

బొల్లినేని కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో
క్యాంపింగ్ సెర్మని ఉత్సవాలు

ప్రజాశక్తి నెల్లూరు

బొల్లినేని కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ధనలక్ష్మి పురం నెల్లూరులో క్యాపింగ్ సేర్మని ,జ్యోతి ప్రజ్వలన ఉత్సవాలు గురువారం ఘనంగా జరుపుకున్నట్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తాళ్లూరి గిరినాయుడు చెప్పారు. కిమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా సాంప్రదాయపరంగా, ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ శ్రీమతి అభినయ రెడ్డి ,గవర్నమెంట్ హాస్పటల్ సూపర్డెంట్ శ్రీమతి విజయ సేన, కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ శ్రీమతి శివమాల హాజరయ్యారు. నూతనంగా నర్సింగ్ కోర్సులలో ప్రవేశించిన విద్యార్థులను వారు అభినందించారు. గత సంవత్సరం ఈ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జ్ఞాపికలు ,సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

ముగిసిన రొట్టెల పండుగ

నామమాత్రంగా యాత్రికులు హాజరు - ప్రభుత్వ నిర్లక్ష్యం..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరులో ఐదురోజులపాటు జరిగిన రొట్టెల పండుగు గురువారం ముగిసింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన యాత్రికులతో ఐదు రోజులు బారాషాహీద్ దర్గా వద్ద సందడి నెలకొంది. ప్రతి ఏడాది విఐపిలు, సినిమా నటులు, రాజకీయ ప్రముఖులతో హడావుడిగా కనిపించే దర్గా ఈ ఏడాది చెప్పుకున్న స్థాయిలో విజయవంతం కాలేదు. ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సరైన సమన్వయం లేకపోవడం, ప్రచారలోపం నెల్లూరు నగరంలో వివిధ అంశాలు ముందుకు రావడంతో రొట్టెల పండుగ ప్రాధాన్యత సంతరించుకోలేదు. ఈ ఏడాది కేవలం నారా లోకేష్ ఒక్కరే రొట్టెల పండుగకు హాజరయ్యారు. అది కూడా విఆర్ కళాశాల ప్రారంభోత్సవం.. టిడిపి నేతల సమావేశాల హడావుడి రెండు రోజులపాటు ఉండటంతో రొట్టెల పండుగమీద అధికారులు ఫోకస్ పెట్టలేదు. మరోవైపు 10, 11, 12 తేదీల్లో రెవెన్యూ క్రీడలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు క్రీడల కోసం వెళ్లడం.. ఏర్పాట్లు తదితర అంశాలపై సమయం కేటాయించారు. 10వ తేదీ గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఏర్పాటు చేయడంతో అధికార యంత్రాంగం దృష్టి అటువైపు వెళ్లింది. దీనికి తోడు 8వ తేదీన కోవూరు రాజకీయ సంఘటన తీవ్ర సంచలనం కలిగించింది. ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు, అనంతరం ఆయన ఇంటిపై దాడి తెలుగు రాష్ట్రాలను సంచలనం రేపింది. ఈ క్రమంలో రొట్టెల పండుగ ప్రాధాన్యత తగ్గిపోయింది. ప్రతి ఏడాది లక్షల్లో యాత్రికులు వచ్చేవాళ్లు..ఈ దఫా పది లక్షల లోపలే జనం వచ్చినట్లు సమాచారం. పండుగ ముగింపు సభ గురువారం రాత్రి పినాకిని అతిథి గృహం ఏరియాలో నిర్వహించారు.

ఘనంగా మెగా పేరెంట్-టీచర్స్ 2.0

ప్రజాశక్తి-నెల్లూరు

చదువుకు పేదరికం అడ్డు కాదు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు రావాలి. వారి పిల్లల చదువు, క్రమశిక్షణ గురించి తెలుసుకోవాలి. ఉపాధ్యాయులతో చర్చించాలి. ఉపాధ్యాయులు కూడా ఏ సబ్జెక్టుల్లో పిల్లలు వెనుకబడి ఉన్నారో గుర్తించి, ఆ పిల్లల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేయాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక దష్టి పెట్టి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి. ఇదే మెగా పేరెంట్ టీచర్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గురువారం నగరం స్టోన్ హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ హైస్కూల్లో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0 కార్యక్రమానికి మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసమే రాష్ట్రవ్యాప్తంగా 45094 పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు కోట్ల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు, ఎంఈఓ తిరుపాల్, హెచ్ఎం ఎస్ మధుసూదన్ బాబు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ బాబు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పుదిద్దుకొంటున్నాయని అన్నం శ్రీనివాసు లు పేర్కొన్నారు. గురువారం తోటపల్లి గూడూరు మండలం నరుకూరు ప్రాథమికొన్నత పాఠశాలలో పేరెంట్స్ మీట్ జరిగింది. శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాణిస్తున్నా రన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశా లలను తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని శ్రీనివాసులు తెలిపారు. ప్రధాన ఉపాధ్యాయులు అమతుల్లా, టిడిపి నాయకులు అరికాటి వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ ఆకుల జయ కు మార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పా ల్గొన్నారు.

నెల్లూరు డెస్క్:బుజబుజ నెల్లూరు లోని శేషు హైస్కూల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "పేరెంట్స్ టీచర్స్ సమావేశం సచివాలయ సిబ్బంది వినీష్ మేడం, నరేంద్ర సార్ల ఆధ్వర్యంలో జరిగింది.గురువు గొప్పతనం గురించిన ప్రార్థనా నత్య గీతంతో సమావేశం ప్రారంభమైంది.స్కూల్ కరస్పాండెంట్ శేషు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు తమతో సహకరించాలని, క్రమశిక్షణతో కూడిన విలువగల విద్యను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సలహాలు, సూచనలను ఉపాధ్యాయులు నమోదు చేసుకున్నారు.తల్లిదండ్రులకు ఆటల పోటీలు పెట్టి శేషు సార్ బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జశ్వంత్ టిప్పు గారు,షాహుల్, శశికళా మేడం, మరియు ఉపాధ్యాయ బందం, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శేషు హైస్కూల్లో..

ప్రజాశక్తి -గుడ్లూరు : ప్రతి విద్యార్థి పరిశుభ్రత పాటించాలని, ప్రతిరోజు పౌష్టి కాహారం తీసుకోవాలని, కిషోర్ బాలికలు నిరంతరం పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ వైద్య అధికారిని డాక్టర్ సాయి ప్రియాంక పేర్కొన్నారు. గుడ్లూరులోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు కోసం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైద్యాధికారిని మాట్లాడారు. విద్యార్థులకు సరఫరా చేస్తున్న మధ్యాహ్నం భోజనం రుచిగా ఉండాలని, మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని వైజాగ్ అధికారిని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ రావు అధ్యక్షతన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల మధ్య అవగాహన సదస్సు జరిగింది.

ప్రజాశక్తి -సైదాపురం : సైదాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ మెగా 2.0 పేరెంట్స్ సమావేశం జరిగింది. ఎంఇఒ సుప్రియ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతు విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలని ఆకాంక్షించారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఇష్టంగా చదువుకోవాలని జీవితంలో జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మరిచిపోకూడదని, విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసు కురావడంతో పాటు పాఠశాలకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. విద్యాకమిటి చైర్మన్ కుంచం నీరజ ,సర్పంచ్ శారద ఉన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 120 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు.ఈ సమావేశంలో తరగతి ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల హొలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్సను అందజేశారు. అనంతరం, తల్లిదండ్రులు మధ్య మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్ వంటి సరదా పోటీలు నిర్వహించారు.వేదికపై జరిగిన సభలో ప్రధానో పాధ్యాయులు పాఠశాల పురోగతిని వివరిస్తూ, అతిథులు, పూర్వ విద్యార్థులు, దాతలను సత్కరించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వం అందించిన తల్లి పేరు మీద మొక్కలను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.సమావేశం విజయ వంతంగా ముగియడం ద్వారా తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యానికి మధ్య సత్సంబంధాలు మరింత బలపడ్డాయి.

వెంకటాద్రిపాలెంలో.. మోడల్ ప్రాథమిక పాఠశాల వెంకట ాద్రిపాలెం తల్లితండ్రులు ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ప్రదానోపాధ్యాయుడు తల్లపనేని శ్రీనివాసరావు, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, దాతలు, పూర్వ విద్యార్థులు,గ్రామస్తులు పాల్గొన్నారు. పాఠశాలలో క్రీడావస్తువులు సుమారు రూ 2,00000 విలువ, ధాత రావూరి కొండయ్య సమా కూర్చారు. రావూరి వెంకటేశ్వర్లు పాఠశాలకు కావాల్చిన ర్యాకులు సమకూర్చుతామని అని చెప్పినారు. పాఠశాల మోడల్ స్కూల్ అయినందున సక్రమంగా విద్యార్థులను పాఠశాల కు పంపవలసినదిగా కోరడమైనది. ముగ్గులు పోటీలలో గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు. ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమం ద్వారా 15000 రాధాకష్ణ విద్యామిత్ర ద్వారా పంపిణి గురించి తెలియజేశారు.

సుపరిపాలనలో 'తొలి అడుగు'

ప్రజాశక్తి-కందుకూరు :అభివద్ధి సంక్షేమ లక్ష్యంగా కూటమి పాలన సాగుతుందని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరు మండలం పాలూరు దొండపాడు గ్రామపంచాయతీ పరిధిలో గురువారం సుపరిపాలన తొలి ఏడాది కార్యక్రమంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రంలో మరియు కందుకూరు నియోజకవర్గం లో జరిగిన అభివద్ధి , సంక్షేమ పథకాలను స్థానిక ప్రజలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వివరించారు. కందుకూరు మండల టీడీపీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, సూరె వినోద్ కుమార్ రెడ్డి, కంద్రా మాల్యాద్రి, తల్లపనేని రవీంద్ర, బుస్సారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, ఆళ్ల హరికష్ణ రెడ్డి, రామాల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు

కందుకూరు మండలంలో..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : సిఎం నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు. కందుకూరు నియోజకవర్గ ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు గుడ్లూరు గ్రామంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. గుడ్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికార్జున, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మేకల మాల్యాద్రి ఉన్నారు.

గుడ్లూరు మండలంలో..

బిఎల్ఓలకు శిక్షణ

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్ : ఎన్నికల నిర్వహణలో బూత్ లెవెల్ అధికారుల పాత్ర కీలకమని నెల్లూరు సిటీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వై.ఓ. నందన్ అన్నారు. గురువారం నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని బిఎల్ఓలకు నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 10,14,15,16,17 వ తేదీలలో నియోజకవర్గంలోని బి.ఎల్.ఓ లు అందరికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యదర్సులు బదిలీ ఉత్తర్వులు అందు కున్నప్పటికీ ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాల్సిం దేనని స్పష్టం చేశారు. శిక్షణలో అధికారులు తెలియజేసిన వాటిని శ్రద్ధగా విని విధిగా ఆచరించాలని కమిషనర్ బిఎల్ఓలకు సూచిం చారు. ఎఈ.ఆర్.ఒ షేక్ షఫీ మాలిక్, ఎన్నికల డిటి వి.ఆనంద్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు : మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు బ్రిగేడియర్ వి. వెంకట రెడ్డి తెలిపారు. గురువారం సైనిక సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు గురించి జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహిం చారు. సహాయ సంచాలకులు కెప్టెన్ సత్యప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికష్ణ, మాజీ వింగ్ కామాండర్ శ్యాంప్రసాద్, కష్ణారెడ్డి, పంచాయతీ రాజ్ డివిజనల్ ఇంజనీర్ చంద్రశేఖర్, అసోసియేషన్ నాయకులు రత్నయ్య, బి.జె.రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ప్రసన్న వ్యాఖ్యలు దుర్మార్గం

ప్రజాశక్తి-వరికుంటపాడు: వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని టిడిపి మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరికుంటపాడు లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయన సతీమణి కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, జిల్లా రాజకీయాలలో మకుటం లేని, మచ్చలేని మారాజుగా పేరు తెచ్చుకున్నారు. అటువంటి వారిపై ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అటువంటి వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. నియోజకవర్గంలో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేస్తున్నటువంటి అభివృద్ధిని ఓర్వలేక ఎన్నికల ఓటమిని జీర్ణించుకోలేక పాలనాపరంగా విమర్శలు దొరకక మతిభ్రమించి ప్రసన్న కుమార్ రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. సమాజంలో మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాల్సింది పోయి మహిళలను అగౌరవపరచడం వైసిపి నాయకులకు పరిపాటిగా మారిందని అలాంటి పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. వైసీపీ అధినేత బాటలోనే మిగిలిన నాయకులు కూడా వ్యవహరిస్తున్నారని సమాజంలో ఒక ఉన్నతమైన విలువలతో ఉండాలి తప్ప విలువలు కోల్పోయి మహిళలను అగౌరవపరిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రసన్న కుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రాజకీయాల నుంచి బహిష్కరించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బట్టేపాడు సొసైటి అధ్యక్షుడిగా ధనుంజయరెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఆత్మకూరు మండలం బట్టేపాడు సొసైటి అధ్యక్షుడిగా తూమాటి ధనుంజయరెడ్డిని నియమించారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో ఆయనను బట్టేపాడు సొసైటి చైర్మన్ గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బట్టేపాడులో తూమాటి వారిది రాజకీయ కుటుంబమే కాక బట్టేపాడు ఎంపీటీసీగా ధనుంజయ రెడ్డి అన్న కుమారుడు డాక్టర్ తూమాటి శేఖర్ రెడ్డి ఉన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి-బిట్రగుంట: కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఇల్లూ సంతోషంగా ఉందని, కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పట్ల ప్రజల్లో సంతృప్తి నెలకొందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బోగోలు మండలం కొండ బిట్రగుంట గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివరాలను పై టీడీపీ యాప్ లో అప్ లోడ్ చేసి వారితో సెల్ఫీ దిగారు. కరపత్రాలు అందచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న, అమలు చేయబోయే పథకాలను వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం,బోగోలు మండలం టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరావు,టిడిపి నాయకులు కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి,రావి విజయ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న దృశ్యం

హామీలను నెరవేర్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ లో భాగంగా ఇచ్చిన ఆరు హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 90 శాతం పూర్తి చేశారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మండలంలోని రావూరు అరిశ వారి కండ్రిగ, పున్నూరు ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను తిరిగిన ప్రతి ఇంట్లో అభివద్ధి సంక్షేమం సమ పాలనలో జరుగుతుందని ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపినట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు స్కూల్స్ లో మార్పులను తీసుకునివచ్చి ఒక క్లాస్కు ఒక టీచర్ అనే విధానాన్ని పెట్టడం హర్షనీయం అన్నారు. గవర్నమెంట్ స్కూల్లో క్వాలిటీతో కూడిన బుక్స్ బ్యాక్ యూనిఫాంను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా రాష్ట్రంలో అస్తవ్యస్తంగా రోడ్లను పునరుద్ధరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పవన్ రెడ్డి,చెంచు కిషోర్ బాబు, ముంగర గోపాల్, సుమన్ యాదవ్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో జాబ్ మేళా

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఆత్మకూరు ప్రాంత నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆగస్టులో పెద్ద ఎత్తున మెగా జాబ్ మేళా నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్న అధికారులు తెలిపారు. గతంలో నిర్వహించిన జాబ్ మేళాలలో అనేక మంది యువత మోసపోయిన విషయాన్ని సమగ్రంగా పరిశీలించారు.ఆత్మకూరు వేదికగా నిర్వహించే ఈ మెగా జాబ్ మేళా ను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నారు.. నిరుద్యోగులుగా ఉన్న యువత వారి దరఖాస్తులను నేరుగా సిఎం డాష్ బోర్డు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లింక్ అయ్యే విధంగా కోడ్ విడుదల చేశారు. ప్రయివేట్ కంపెనీల లో యువతకు పూర్తిస్థాయి భద్రత లభించేలా కార్యక్రమాన్ని చేపట్టబోతున్నారు..

ఘనంగా మంత్రి ఆనం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులుఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో టీడీపీ మండలాధ్యక్షులు దేవరాల గంగాధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఆనం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లుతూ మరెన్నో ఉన్నత పదవి అలంకరించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ జనార్ధన్ నాయుడు, జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి లక్ష్మి నరసయ్య డల ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డిఉపాధ్యక్షులు హాజరత్ బాబు,మాజీ ఎంపీపీ కోనంకి శ్రీనివాసులు నాయుడు, మాజీ మండలాధ్యక్షులు నారాయణ, సొసైటీ మాజీ చైర్మన్ చిన్నారెడ్డి, టీడీపీనాయకులు గంగినేని శ్రీనివాసులు నాయుడు, మాడుపూరు చంద్ర బాబు చాబోలు సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి నాయకులుఆలా సురేష్, హజరత్రెడ్డి, ఉంటా వెంగలరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

విద్యతనే పురోగతి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: విద్యతోనే విద్యార్థులు పురోగతి సాధిస్తారని కమిటీ చైర్మన్ సురేఖ తెలిపారు. గురువారం మండలం లోని నరసాపురం మోడల్ ప్రైమరీ స్కూల్లో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్య కమిటీ చైర్మన్ సనుమూరు సురేఖ విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన ముగ్గులు పోటీలలో గెలు పొందిన వారికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు రామశేషమ్మ, మాధవి లత, ముంతాజ్ బేగం, పరమేశ్వరమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంత్రి ఆనం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి జూలై 10వ తేదీ ఆయన పుట్టినరోజు సందర్భంగా నెల్లూరు ఆనం స్వగృహానికి చేరుకొని ఆనం రామనారాయణ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయనకు బొకే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిండు నూరేళ్ళ ఆయురా రోగ్యాలతో జీవించాలని, ఆయన మరెన్నో పదవులు అధిరోహించాలని మనసారా కోరుకుంటున్నామని అన్నారు. ఆయన వెంట బుజ్జి రెడ్డి , తదితరులు ఉన్నారు.

దేశ భవిష్యత్తుకు పునాది తరగతి గదే


ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తదిరులు

ఎంఎస్‌పేటలో

బుచ్చిరెడ్డిపాళెంలో ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

కావలిలో

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

దేశ భవిష్యత్తుకు తరగతి గదే పునాది అని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని స్టోన్ హౌస్ పేట లో ఉన్న ఆర్ ఎస్ ఆర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమంలో మంత్రి నారాయణతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా సభా ప్రాంగణానికి చేరుకున్న నేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు విద్యార్థులు తల్లి దండ్రులు స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ మీటింగ్ నిర్వహిస్తున్నారని చెప్పారు. పాఠశాల అభివృద్ధిలో టీచర్లు తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు దగ్గర అవుతారనీ, పాఠశాలల్లో ఎంత నాణ్యమైన విద్య అందుతుంది, ఎలాంటి వసతులు ఉన్నాయి అనేది అర్థమవుతుందన్నారు. తెలుస్తుంది. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారం అవుతాయని చెప్పారు. తల్లిదండ్రులు వారి పిల్లలతో రోజూ 15 నిమిషాలు మాట్లాడితే వారు ఏం నేర్చుకుం టున్నారో తెలుస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా మీరు పడుతున్న కష్టాలను పిల్లలకు తెలియజేయాలని, కష్టపడే తత్వాన్ని అలవాటు చేయాలన్నారు. బడిలో విద్యార్థుల బాధ్యత టీచర్లది. ఇంట్లో తల్లిదండ్రులదని, దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్ద బడుతుందని చెప్పారు.తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి 15 వేలు వారి తల్లుల అకౌంట్లలో వేశారని, ప్రతి శనివారం నో బ్యాగ్ డే గా నిర్వహిస్తూ.. చిన్నారులపై భారాన్ని తగ్గిస్తున్నారని వివరించారు. సన్నబియ్యంతో పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ స్కీం కింద పాఠశాలలను అభివద్ధి చేస్తున్నారని వివరించారు. ఆర్ ఎస్ ఆర్ హై స్కూల్ ను అభివృద్ధి చేసి విద్యార్థులకు మంచి వసతులు కల్పిస్తామని వెల్లడించారు. మంత్రి నారాయణ మాట్లా డుతూ.. రాష్ట్రంలో 45వేల94 ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్స్ పేరెంట్స్ టీచర్స్ మీటింగ్లో పాల్గొం టున్నారని తెలి పారు. భారతదేశంలోనే ఎక్కడ కూడా ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం జరగలే దన్నారు . విద్యార్థుల చదువు నడవడికలు పేరెంట్స్ తెలుసు కునేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.. పెద్ద పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ పేరెంట్స్ టీచర్ మీటింగ్ పెట్టారన్నారు.. నెల్లూరు ప్రజల తరఫున మంత్రి లోకేష్ కి నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.. చదువుకు పేదరికం అడ్డు కాదని అందుకే నేనొక నిదర్శనం అని తెలిపారు.. పిల్లలకు చదువే తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి అని.. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ ,సంక్షేమాన్ని మా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీ రావు ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ ,మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి ,నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు ,కార్పొరేటర్లు శ్రీకాంత్ రెడ్డి ,సుజాత ,బీసీ బాబు స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్ సురేష్ ,డివిజన్ క్లస్టర్లు శ్రీనివాసులు నాయుడు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి: విద్యార్థులు తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, చదువుకున్న పాఠశాలకు కీర్తిప్రతిష్ఠలు తీసుకువచ్చేలా అత్యున్నత శిఖరాలు అధిరోహిం చాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి రూరల్ మండలం రుద్రకోట జెడ్పి హైస్కూల్,కావలి పట్టణం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు విద్యార్థులు,విద్యార్థి తల్లి దండ్రులు, ఉపాధ్యాయులుస్వాగతం పలికారు. ఎమ్మెల్యే విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఉత్తమ విద్యార్థు లకుబహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థి తలిదండ్రులు, విద్యా కమిటీ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బాల,బాలికలకు చదువులతోపాటు సంస్కారాన్ని కూడా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నేర్పాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం ఎస్ కె ఆర్ఎస్, డి ఎల్ ఎన్ ఆర్ కళాశాల సిబ్బంది నిర్వహించిన ఉపాధ్యా యులు, తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్య అతిథిగా గురువారం ఆమె పాల్గొనగా కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు ఆమెను ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు దేశం గర్వించదగ్గ విద్యార్థులుగా మీరందరూ మెలగాలన్నారు. చదువులతో పాటు సంస్కారంతో కూడిన నైతిక విలువలతో విద్యార్థులు ఉంటూ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారం గంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఒకరు లేక ఇద్దరూ ఉండే ఉపాధ్యాయులు క్లాస్ కి ఒక టీచర్ ఉండే విధానాన్ని ఆయన ప్రవేశపెట్టా రన్నారు. పరిజ్ఞానం పెరిగి ప్రపంచాన్ని శాసిస్తున్న ఈ రోజుల్లో మేదస్సును ఉపయోగించి టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని విద్యార్థులకు ఆమె హితోపదేశం చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం సరిగా లేదని పిల్లలు ఆమె దష్టికి తీసుకురాగా భోజనాన్ని పరిశీలించి సరిగా లేకపోవడంతో నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సిబ్బందిని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టౌన్ మరియు రూరల్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్ రెడ్డి , కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్, పుట్టా లక్ష్మీకాంతమ్మ, తాళ్ల వైష్ణవి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, డిఎన్ఎల్ ఆర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి: ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ, గురుకుల, బాలుర పాఠశాల వెంగళరావు నగర్ కావలిలో గురువారం తల్లి దండ్రులు, టీచర్స్,విద్యార్థులతో ఆత్మీయ సమావేశం ప్రిన్సిపల్ ఎన్.శ్యామ్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం లో విద్యార్థుల అబ్యాసన, సామర్ధ్యాలు,ప్రవర్తన, తదితర అంశాలపై, తల్లి దండ్రులసమావేశం నిర్వహించారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు: కష్టపడి చదువులో రాణిస్తున్నావు ఇలాగే రానివ్వు అవసరమైతే అండగా ఉంటా అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు అన్నారు. మండలంలోని విరువూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తల్లిదండ్రులకు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదవ తరగతి పరీక్షల్లో మండలం ఫస్ట్ వచ్చిన గుబిలి తరుణ్ తేజకు 5 వేల రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో చదువుకు సంబంధించి ఎటువంటి అవసరం వచ్చిన తనకు తెలియజేయమని తాను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు చంద్ర వెంకయ్య, జడ్పిటిసి నాగేంద్ర, తెలుగు యువత అధ్యక్షులు ముజే లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ దేవరబోయిన మధు, ఉపాధ్యాయులు హజరత్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : పిల్లల బంగారు భవిష్యత్తు కోసం. బడివైపు ఒక అడుగు పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు పిలుపుమేరకు జరుగుతుందని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పేర్కొన్నారు.అందులో భాగంగా గురువారం ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరి మండలం లోని మోడల్ హైస్కూల్, ఉన్నత పాఠశాలలో జరుగుతున్న తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాదు అని, ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు రావాలి.. వారి పిల్లల చదువు క్రమశిక్షణ గురించి తెలుసుకోవాలి. ఉపాధ్యాయులతో చర్చించాలి, ఉపాధ్యాయులు కూడా ఏ సబ్జెక్టులో పిల్లలు వెనుకబడి ఉన్నారో గుర్తించి, ఆ పిల్లల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేయాలి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎంఇఒ సురేష్, భుజం వెంకట కృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకట సుబ్బయ్య, పూసాల వెంగప నాయుడు, కాకు మహేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో మెగా పిటిఎం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య ఆహ్వానితులుగా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జానకిరామ్ రావడం జరిగింది.ఈ కార్యక్రమం ఒక పండుగ వాతావరణం లో విద్యార్థులు వారి తల్లుల పాదాల వద్ద పుష్పాలను ఉంచి నమస్కరించడం జరిగింది. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ షేక్ ఇంతియాజ్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ పంపిణీ

ప్రజాశక్తి-కావలి.

స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నతపాఠశాలలోని మండల భవిత సెంటర్‌లో ఎస్ఎస్‌సి .2025ఎగ్జామ్స్ లో ఉత్తీర్ణత సాధించిన వికలాంగుడైన మనోహర్ అనే విద్యార్థికి కావలి డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఎం. హరిప్రసాద్ మెరిట్ స్కాలర్షిప్ అందజేశారు. భవిష్యత్ లో ఇదే విధంగా బాగా కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని అభిలషించారు. కార్యక్రమంలో ఎంఇఒ 2 వెంకట సుబ్బయ్య, ప్రధానోపాధ్యాయులు పేరిశెట్టి మాధవరావు, పాఠశాల పి.డి. చిరంజీవి, కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ. జె.వి.వి.సభ్యులు యం.రమణయ్య, బి.శ్రీనివాసులు,సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కావలి: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నతపాఠశాలలోని కావలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ బ్లడ్ డోనర్స్ వారోత్స వాలు–2025 లో బహుమతులు సాధించిన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను గౌరవ కావలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.హరిప్రసాద్ అభినందించారు. విద్యాశాఖాధికారి–2 వెంకట సుబ్బయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేరిశెట్టి మాధవరావు, పాఠశాల పి.డి. చిరంజీవి, గాదిరెడ్డి హరనాథ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ. జె.వి.వి.సభ్యులు యం.రమణయ్య, బి.శ్రీనివాసులు, సుధాకర్,విద్యార్థులు పాల్గొన్నారు.

నేడే డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి-కావలి: శుక్రవారం ఉదయం 11నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు 9959225643 నంబర్ కు ఫోన్ చేసి తెలపాలన్నారు. వీలైన అన్ని సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. గత డయల్ యువర్ డియం కార్యక్రమాలలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను దాదాపు అన్నింటిని పరిష్కరించా మని వివరించారు. తమ డిపో పరిధిలోని కావలి , జలదంకి , కలిగిరి , బోగోలు, కొండాపురం , దగదర్తి ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన నిత్య అందుతుందని బిట్ –1 ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లి తండ్రి తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చి మంచి విద్యను అందించాలన్నారు. విద్య కోసం ప్రభుత్వం పేద విద్యార్థులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నాణ్యమైన భోజనం నోటి పుస్తకాలు కిట్లు తదితర విద్యాసామాగ్రిని అందజేస్తుందన్నారు. విద్యార్థిని విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. అనంతరం వీడియో ద్వారా పిల్లలకు సులభతరంగా చేపట్టే విద్యా బోధనలను వీక్షించి విద్యార్థులు చేపట్టిన వివిధ రకాల సాంస్కృతి కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాగేళ్ల అనూష, ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్ నల్లిపోగు నరసింహులు గడ్డంహజరత్ బిట్ 1 సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేతంరెడ్డి

విపిఆర్ పేరు చెబితే భయం..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: సభ్య సమాజం తలదించుకునేలా కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శనమని టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంతిరెడ్డిపై నీచపు మాటలు మాట్లాడిన, దాన్ని వెనకుండి ప్రోత్సహించిన అనిల్ కుమార్ యాదవ్‌లను మహిళా లోకం చీదరిచుకుంటోందని దుయ్యబట్టారు. విపిఆర్ పేరు చెబితేనే వారికి ప్యాంటు తడిచిపోతోందని ధ్వజమెత్తారు. అనిల్ కుమార్ యాదవ్ ఒక టపాస్ బాలు లాంటి వ్యక్తి అని అన్నారు. సమాజంలో సిగ్గు ఎగ్గు లేకుండా జీవిస్తున్న వ్యక్తులు, బూతుల రాజకీయానికి కేరాఫ్ అడ్రస్ ప్రసన్న కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ అని విమర్శించారు. గతంలో ఎంపి వేమిరెడ్డి దంపతుల కాళ్లు పట్టుకొని డబ్బులు దండుకున్న చరిత్ర మర్చిపోవద్దని హెచ్చరించారు. జైలుకు వెళుతున్న నాయకులకు పిలిచి మరి జగన్మోహన్ రెడ్డి టికెట్లు ఇస్తున్నాడని, అందుకే అనిల్ కుమార్, ప్రసన్న జైలుకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారన్నారు.కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సిద్దు సుబ్బారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎల్సి రమణారెడ్డి, సాయి కష్ణారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు కనకేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండింగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-కావలి: కావలి మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ లో గురువారం కమిషనర్ జి. శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ మీటింగ్ లో పురపాలకసంఘ పరిధిలో గల స్ట్రీట్స్ ను 3 కేటగిరిలుగా (1) గ్రీన్ జోన్, (2)రెడ్ జోన్, (3) అంబర్ జోన్ లుగా విభజించారు. స్ట్రీట్ వెండర్స్ కు అవగాహన కల్పించాలని, సదరు వారికీ గుర్తింపు కార్డు లు జారీ చేయాలని ఆదేశించారు.సదరు గుర్తింపు కార్డులు జారీ చేయు విషయాన్ని, వారికీ ఇన్సూరెన్స్ చేయు విషయంపై తగు చర్యలు చేపట్టెందుకు తీర్మానించారు. సదరు స్ట్రీట్ వెండర్స్ వారి పిల్లలను వారి వ్యాపారాలలో ఉంచక, వారిని పాఠశాలలకు పంపక అత్యున్నత విద్య అభ్యసించేందుకు తగు చర్యలు చేపట్టెందుకు తగు సూచనలు అందజేయాలని తీర్మానించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల విద్యాశాఖ అధికారి 2 తోట శ్రీనివాసులు మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటరావుపల్లి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి పాఠశాలను సందర్శించి సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రుల బాధ్యతలు, ఉపాధ్యాయుల బాధ్యతలు తెలియజేస్తూ పాఠశాల అభివద్ధికి ఈ సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అతిథులు, పూర్వ విద్యార్థులు, రాజకీయ నాయకులు అందరూ సహకరించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు మండల విద్యాశాఖ అధికారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-దగదర్తి: కావలి విద్యుత్ ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ జి ఖాజా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి పాల్గొంటారని తెలిపారు మండలంలోని విద్యుత్ వినియోగ దారులు ఎదుర్కొన్న సమస్యలపై పరిష్కరిం చుకున్నందుకు విద్యుత్ వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆరోగ్య సంరక్షణ సేవలు

ప్రజాశక్తి-కావలి: వెంగళరావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ లో గురువారం డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది.పి .హెచ్.సి.డాక్టర్ ఎం.మహేష్ వైద్య పరీక్షలు నిర్వహించిన తదుపరి ఆయన మాట్లాడుతూ, సురక్షిత కాన్పులు జరగాలని,తల్లి, బిడ్డ ఆరోగ్యంగా వుండాలని, అంగనవాడీల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టకాహారం ఉపయోగిం చుకోవాలని, తల్లిబిడ్డ ఆరోగ్య సంరక్షణ మా బాధ్యత అన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-కలిగిరి : స్థానిక హై స్కూల్ ప్రాంగణంలోగల చిల్లర దుకాణాలలో పొగాకు గుట్కాలు, హాన్స్ అనుమతి లేకుండా విక్రయిస్తున్న దుకాణాలపై ఏ ఎస్ ఐ జ్యోతి .రామచంద్రరావు దాడులు నిర్వహించి రూ.200 ఫైన్ విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, పబ్లిక్ ఆవరణలో పొగాకు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని చిలకల మర్రి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ గురువారం పరిశీలించారు. కాలువ కూడికతీత పనులకు హాజరైన వేతన దారులను ఉద్దేశించి ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వం 307 రూపాయలు నిర్ణయించిన వేతనాన్ని పొందాలంటే ప్రతి ఒక్కరూ కొలతలు ప్రకారం తప్పనిసరిగా పనిచేయాలన్నారు. సాంకేతిక సహాయకులు మరియు క్షేత్ర సహాయకులు కూడా తప్పనిసరిగా ఉపాధి వేతన దారులకు ముందుగా కొలతలు తెలియజేసి వాటి ప్రకారం పని చేసే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వేతన దారుల హాజరు పరిశీలించారు.

అందరికీ నమస్కారం..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: జిల్లా రెడ్ క్రాస్ లో చేసిన సేవలకు గుర్తింపుగా గవర్నర్ అవార్డును.. (గోల్డ్ మెడల్) ప్రకటించడం ఎంతో సంతోషాన్నిచ్చింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 11 గంటలకు గవర్నర్ చేతుల మీదుగా అవార్డు ను అందుకోవాల్సి ఉంది. విజయవాడకు వెళ్లే మార్గంలో ఏర్పడ్డ కొన్ని అనివార్యకారణాల వలన కళాక్షేత్రానికి అనుకున్న సమయానికి చేరుకోలేకపోయాను. మినిట్ టు మినిట్ పద్దతిలో జరిగే గవర్నర్ ప్రోగ్రాం కు సమయానికి చేరుకోలేక పోవడం తో గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోలేకపోయాను. ఈ విషయంలో గోల్డ్ మెడల్ అందుకోలేకపోవడం.. బాధ అనిపించలేదు..కారణం.. రెడ్ క్రాస్ లో స్వచ్ఛందంగా చేసిన సేవా కార్యక్రమాలు నాకు అవార్డులకు మించి ఎంతో తప్తినిచ్చాయి.ఆ జ్ఞాపకాలు నాకు జీవిత కాలం గుర్తు ఉంటాయి.

వడ్డెర రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఈనెల 27, 28 తేదీలలో నెల్లూరు నగరంలో జరుగు ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రధమ రాష్ట్ర మహాసభలను అధిక సంఖ్యలో పాల్గొని జయప్రద చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు బత్తల నాగరాజు కోరారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ వడ్డెరలకు రక్షణ భద్రత కల్పించాలని, వడ్డెర కులాన్ని ఎస్టీల జాబితాలో చేర్చాలని, క్వారీల్లో పనులు వడ్డెర కులస్తులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బిఎల్ఒలకు శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మండల స్థాయి బిఎల్ఒలకు ఒక్కరోజు శిక్షణ శిబిరం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి బి ఎల్ఒలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పద్మజా కుమారి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్తగా ఓట్ల నమోదు, ఓటు కార్డు నందు మార్పులు చేర్పులు, చనిపో యిన వారి ఓట్ల తొలగింపు, ఓట్లకు సంబంధించిన అనేక రకాలైన సమస్యలు, పరిష్కారాల గురించి శిక్షణ కార్యక్రమంలో బిఎల్వోలకు తెలియజేయడం జరిగిందని తెలిపారు ఈ శిక్షణలో పాల్గొన్న బి ఎల్ఒలకు తహశీల్దార్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎఎస్ ఓ లలిత, ఆర్ఐ సంకె.కొండయ్య, విఆర్ఒలు పాల్గొన్నారు.

పొలం డాక్యుమెంట్లు పోయినవి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చాగొల్లు గ్రామ నివాసి **వల్లూరి హరికిషోర్,** తండ్రి **రమణయ్య** కు చెందిన పొలం డాక్యుమెంట్లు పోయినవి. ఈనెల 6వ తేదీన చాగొల్లు గ్రామం నుండి ఉలవపాడుకు ఆటోలో వస్తుండగా **2227/1989 నెంబరు** గల పొలం డాక్యుమెంట్లు ఉన్న కవరు పోయినది. దొరికినవారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
వల్లూరి హరికిషోర్, తండ్రి **రమణయ్య,**
చాగొల్లు గ్రామం, ఉలవపాడు (మం)
ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా,
సెల్ నెం: **9550405577**